# వర్కింగ్ జర్నలిస్ట్

## సమాచార స్రవంతి

సంపుటి : 12 సంచిక : 5 ఏప్రిల్ 2023 వెల : రూ.5/-




జర్నలిస్టులకు తక్షణమే ఆరోగ్యబీమా అమలుచేయాలని సమాచార శాఖ కమిషనర్ విజయకుమార్‌రెడ్డిని కలిసిన ఫెడరేషన్ నాయకులు



విజయవాడలో 2023 మీడియా డైరీ ఆవిష్కరించిన ప్రెస్ అకాడెమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుతో ఫెడరేషన్ ప్రతినిధులు



విశాఖపట్నంలో 2023 మీడియా డైరీ ఆవిష్కరించిన పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో ఫెడరేషన్ ప్రతినిధులు




అనకాపల్లిలో మార్చి 7న జరిగిన ఫెడరేషన్ సర్వసభ్య సమావేశం అనంతరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను అభినందించి సత్కరించిన జిల్లా ఫెడరేషన్ సభ్యులు




విశాఖపట్నంలో ఉగాది సంబరాల దృశ్యాలు







కాకినాడ జిల్లా తుని నియోజకవర్గ కమిటీకి నూతనంగా ఎన్నికైన ఫెడరేషన్ నాయకులు

# వర్కింగ్ జర్నలిస్ట్ సమాచార స్రవంతి

**సంపుటి: 12 ఏప్రిల్ 2023 సంచిక: 5**


## లోపలి పేజీల్లో...


| | |
|---|---|
| నకిలీ వార్తలతో ప్రమాదం .............. | 4 |
| హెల్త్‌కార్డుల పునరుద్ధరణకు వినతి ............. | 5 |
| ఆరోగ్యశ్రీలో జర్నలిస్టులకు ప్రత్యేక ఏర్పాటు .................. | 6 |
| జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం ........................ | 7 |
| ప్రెస్ అకాడెమీ ఆధ్వర్యంలో డిప్లొమా ............ | 8 |
| నైతిక విలువల పతనం దిశగా జర్నలిజం .................. | 10 |
| అగ్రసేని ఆస్పత్రి యాజమాన్యంపై చర్యకు డిమాండ్ ....................... | 11 |
| ప్రెస్ అకాడెమీ పూర్వాధ్యక్షులు కన్నుమూత .......................... | 12 |
| ట్రంప్ కొంపకు ముర్డోక్ తిప్పలు .......................... | 14 |
| మహిళా జర్నలిస్టుకు అవార్డు ..................... | 17 |
| వ్యాలీరోజ్‌కు ఎక్సలెన్సీ అవార్డు ....... | 19 |
| వాస్తవాల వెల్లడికే మీడియా ప్రాధాన్యత ....... | 22 |



**సంపాదకులు**

**ఎ.అమరయ్య**

**వర్కింగ్ ఎడిటర్స్**

**ఎన్.కొండయ్య** **ఎం.ఎ.రవూఫ్**

**సంపాదకవర్గం**

| | |
|---|---|
| జి.ఆంజనేయులు | ఎస్.వెంకట్రావు |
| వి.నవీన్‌రాజ్ | ఎమ్. శ్రీనివాస్ |
| బి.ఎన్.ప్రసాదరావు | వి.గోపి |
| వి.రామారావు | ఆర్.రామాంజనేయులు |
| బి. ఈశ్వరరావు | కె.వేణుగోపాలరావు |
| టి.మద్దులేటి | వి.భక్తవత్సలం |
| ఒ.శాంతి | ఎస్.మురళీశంకర్ |
| కె.ఎస్.శంకరరావు | జి. శీనుబాబు |
| డి.మధుసూదనరావు | |

**డిజైనర్:**



**PUBLISHED, PRINTED AND EDITED BY**
**G. Anjaneyulu on behalf of**
**Andhra Pradesh Working**
**Journalists Federation**
H. No.1-7-9/A, Plot No.40, 402, Surabhi Sapphire, Golconda 'X' Roads, Musheerabad, Hyderabad-500 020, A.P. Ph:040-27671067

**PRINTED AT**
**Prajashakthi,** M.B. Bhavan, Near RTC Cross Roads, Hyderabad-500 020.

**EDITOR**
**A.Amaraiah**
e-mail:editorworkingjournalist@gmail.com,
Cell: 9912199494
RNI No. APMUL/2009/37690


## జర్నలిస్టుల రక్షణలో ఇది తొలి అడుగు!

భారతదేశంలో జర్నలిస్టులకు రక్షణ కరవయింది. ప్రపంచ దేశాల్లో జర్నలిస్టుల రక్షణలో మనస్థానం 150. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైనప్పటికీ జర్నలిస్టులపై దాడులు, ప్రాణాలు తీయడం, బెదిరించడం సర్వసాధారణంగా మారింది. అసాంఘిక శక్తులకు తోడుగా అధికారులు, రాజకీయనాయకులు కూడా ఇటువంటి చర్యలకు వెనకాడ్డం లేదు. రాజ్యాంగ వ్యవస్థ కూడా తన వంతుగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులకు మద్దతు నిలుస్తున్న స్థితి. పెరుగుతున్న దాడుల నేపథ్యంలో వాటి నిరోధానికి తమకున్న పరిమితమైన శక్తితో గళమెత్తి రక్షణ కోసం శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రయత్నానికి చిన్న తోడ్పాటు ఇంతకాలానికి లభించింది. జర్నలిస్టుల రక్షణకు సంబంధించి ప్రభుత్వాల నుంచి తొలి అడుగు పడింది. చత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ సాక్షిగా చత్తీస్‌గఢ్ మీడియా పర్సన్స్ ప్రొటెక్షన్ బిల్లు-2023ను ఆమోదించి చట్ట రూపం కల్పించింది. ఇందులో పొందుపరిచిన అంశాల ప్రకారం జర్నలిస్టులపై వ్యక్తులు, సంస్థలు దాడులకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకునేందుకు వీలు కల్పించారు. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీని నిలబెట్టుకునే ప్రయత్నంలో భాగంగా ఈ చట్టం రూపుదాల్చింది. అయితే ఇందులో దాడులు చేశారని నిర్ధారించేందుకు పెట్టిన నియమనిబంధనలు, దాడులకు పాల్పడిన వారిపై తీసుకునేందుకు సూచించిన చర్యలను గమనిస్తే ఇది కంటితుడుపు వ్యవహారంగా కనిపిస్తున్నది. దాడులకు పాల్పడినవారికి సంబంధించిన కథనాలు కనీసం ఆరు ప్రచురితం/ప్రసారమై ఉండాలి. దాడులకు దిగేవారు ఆరు కథనాలు వచ్చేవరకు వేచి చూసే అవకాశం ఉండదు. ఈలోపు ఆ జర్నలిస్టు మరణం అంచులను చూడాల్సి ఉంటుంది. అందుకనే జాతీయ జర్నలిస్టుల సంఘం నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్.ఎ.జె) విధుల్లో ఉండే ప్రభుత్వ ఉద్యోగులకు విఘాతం కలిగితే ఎటువంటి చట్టబద్ధమైన రక్షణ ఉంటుందో విధినిర్వహణలోని విలేకరి కూడా అటువంటి రక్షణ లభిస్తే తమ విధులను నిరాటంకంగా నిర్వహించే వీలుంటుందని కోరుతున్నది. ఈ డిమాండ్‌కు కేంద్రంలో ఉన్న ప్రభుత్వంతో పాటు అన్ని రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వాలు, పాలించే రాజకీయ పార్టీలు గుర్తించినపుడు మాత్రమే అది సాధ్యపడుతుంది.



# నకిలీ వార్తలతో ప్రమాదం

జస్టిస్ డివై చంద్రచూడ్

నకిలీ వార్తలు సమాజంలో ఉద్రిక్తతలను సృష్టిస్తాయని, అవి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన జర్నలిజం అనేది ప్రజాస్వామ్యానికి ఇంజన్‌లా పనిచేస్తే మంచి భవిష్యత్తుకు బాటలు వేస్తుందని అభిప్రాయపడ్డారు. న్యూఢిల్లీలో మార్చి 22న జరిగిన 16వ రామ్‌నాథ్ గోయంకా అవార్డుల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

ప్రస్తుత డిజిటల్ యుగంలో ఖచ్చితత్వం, పక్షపాతరహితం, బాధ్యత, ధైర్యంతో జర్నలిస్టులు విధులు నిర్వహించడం ముఖ్యమన్నారు. ఎమర్జెన్సీ సమయంలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ మౌన నిరసనకు సూచిక ఖాళీ పేజీలను అందించడం ద్వారా మౌనం ఎంత శక్తివంతమైనదో తెలియచెప్పిందని వివరించారు. వార్తలను అందించడం ఎలాగో అప్పటి పరిస్థితులు నేర్పాయని తెలిపారు. నిజాలు మాట్లాడకుండా మీడియాను నియంత్రిస్తే ప్రజాస్వామ్యం గొప్పతనం మసకబారుతుందని అభిప్రాయపడ్డారు. జర్నలిజం ఒక వ్యవస్థలా ఎదిగేందుకు నిర్మాణాత్మక ప్రజాస్వామ్యం సహకారం అందజేయాలని సూచించారు.

సినీ పరిశ్రమలో లైంగిక వేధింపులపై ప్రారంభమైన మీటు ఉద్యమం మీడియా కథనాల ద్వారానే అతిపెద్ద ఉద్యమంగా మారింది. అత్యాచారాల పైన మీడియా కథనాలు ప్రజల్లో చైతన్యానికి కారణమయ్యాయి. దేశంలో ప్రజాస్వామ్యం నిలవాలంటే మీడియాకు స్వేచ్ఛ ఉండాలి. వార్తాపత్రికలు ఎన్నో సామాజిక రాజకీయ మార్పులకు కారణమయ్యాయని సవివరంగా తెలియజేశారు. ఒక్కోసారి మీడియా అత్యుత్సాహం నేరం నిర్ధారణ కాక కాకముందే కొంతమంది వ్యక్తులను దోషులుగా ప్రజల ముందు నిలబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టులు వారిని దోషులుగా తేల్చకముందే జరిగే ఇటువంటి చర్యలు వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. అనంతరం 2019, 2020 కి సంబంధించి 43 మంది జర్నలిస్టులకు ఆయన అవార్డులను అందజేశారు.

## ఆరు యూట్యూబ్ ఛానళ్లపై నిషేధం

ఖలిస్తాన్ భావజాలాన్ని ప్రసారం చేస్తున్న ఆరు యూట్యూబ్ ఛానళ్లపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించిందని అధికార వర్గాల సమాచారాన్ని బట్టి తెలుస్తున్నది. దేశ భద్రతకు భంగం కలిగించే విధంగా విదేశాల నుంచి పంజాబీ కార్యక్రమాలు ప్రసారం చేస్తున్న ఈ ఛానళ్లను గత పది రోజులుగా బ్లాక్ చేసినట్లు సమాచార ప్రసార శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర చెప్పారు. ఖలిస్తాన్ సానుభూతిపరుడు అమృతపాల్ సింగ్ ఇటీవల పంజాబ్‌లోని పోలీస్‌స్టేషన్ పై దాడి చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది.

# హెల్త్ కార్డుల పునరుద్ధరణకు వినతి



జర్నలిస్టుల హెల్త్ కార్డులను పునరుద్ధరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎ.పి.డబ్ల్యు.జె.ఎఫ్) ప్రతినిధివర్గం మార్చి 9న సమాచార శాఖ కమిషనర్ టి. విజయకుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఈ ప్రతినిధివర్గంలో అధ్యక్షులు ఎస్ వెంకట్రావు, ఎపిబిజెఎ కన్వీనర్ వి శ్రీనివాసరావు, ఫెడరేషన్ నాయకులు వి సురేష్, బి గోరంట్లప్ప, వలి, టివి రమణ, విజయవాడ నగర కార్యదర్శి ఎం బి నాథన్, ఎపిబిజెఎ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

తే: 09-03-2023

శ్రీ టి. విజయకుమార్‌రెడ్డి ఐ.ఐ.ఎస్.,
కమిషనర్, సమాచార శాఖ,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
విజయవాడ.

విషయం:- జర్నలిస్టుల ఆరోగ్యబీమా పథకం కొనసాగింపు గురించి

ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టులకు 2015 నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించిన ఆరోగ్యబీమా సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. ఈ పథకాన్ని అప్పట్లో మార్చి 21 నుంచి 2016 మార్చి వరకుకొనసాగించారు. ప్రతియేటా ఈ పథకాన్ని ఎప్పటికప్పుడు పొడిగిస్తున్నారు. అందుకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ కృతజ్ఞతలు తెలియజేస్తున్నది.

ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా ఈ పథకాన్ని రాష్ట్రంలోని జర్నలిస్టులు వినియోగించుకుంటున్నారు. ఈ పథకం ఏప్రిల్ 1న ఆరంభమై మరుసటి యేడాది మార్చి 31తో ముగుస్తుంది. కనుక ఈ యేడాది మార్చిలో అడుగుపెట్టాం. వెంటనే ప్రభుత్వ సమాచార శాఖ జర్నలిస్టులు తమ ఆరోగ్యబీమా కార్డులు పునరుద్ధరించుకునేందుకు వీలుగా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నాం.

అదేవిధంగా జర్నలిస్టుల సమగ్ర బీమా పథకం ఇటీవలకాలంలో అమలుకావడం లేదు. ఆ పథకం అమలుకు వీలుగా సమాచార శాఖ ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నాం. ఈ పథకంలో చేరే జర్నలిస్టులు ప్రమాదంలో గాయపడితే తిరిగి కోలుకునే వరకు వైద్యసదుపాయం పొందడంతో పాటు కనీసకాలానికి వేతనానికి బదులుగా పరిహార, పొందే వీలుంది. ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ జర్నలిస్టు కుటుంబం పదిలక్షల రూపాయలు పరిహారం పొందే అవకాశం ఉంది. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

1. జర్నలిస్టుల ఆరోగ్యబీమా కొనసాగించి ఏప్రిల్ 1 నుంచి వచ్చే యేడాది మార్చి 31 వరకు కొనసాగేందుకు వీలుగా కమిషనర్ ప్రకటన చేయాలని అభ్యర్థిస్తున్నాం. 2. సమగ్ర బీమా పథకం కొనసాగించేందుకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నాం. 3. ఆరోగ్యబీమా పథకం అమలు నిరంతరాయంగా కొనసాగేందుకు వీలుగా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి శాశ్వత ఉత్తర్వుల జారీకి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

భవదీయులు

(ఎస్.వెంకట్రావు)
అధ్యక్షులు

(జి.ఆంజనేయులు)
ప్రధానకార్యదర్శి
సెల్ నెం. 9866399883



# ఆరోగ్యశ్రీలో జర్నలిస్టులకు ప్రత్యేక ఏర్పాటు

## ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌కు సీఈవో హామీ

డాక్టర్ వై.ఎస్. ఆర్. ఆరోగ్యశ్రీ పథకం అమలులో పాత్రికేయులకు ఎదురవుతున్న సమస్యలకు సత్వర పరిష్కారం పొందేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ప్రెస్ అకాడమి ఛైర్మన్ శ్రీ కొమ్మినేని శ్రీనివాస రావు తెలిపారు. 104 హెల్ప్ లైన్'' లో ప్రత్యేకంగా నెంబరు4ను ప్రెస్ చేసి జర్నలిస్టులు తమ సమస్యలకు పరిష్కారం పొందవచ్చని ఆయన తెలిపారు. ఈ యేర్పాటు ఏప్రిల్ నాటికి అందుబాటులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇందుకు ఆమోదం తెలిపిన ఆ సంస్థ సి.ఇ.ఒ.కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వై.ఎస్.ఆర్. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ముఖ్య కార్య నిర్వాహణాధికారి కార్యాలయంలో సి.యి. ఓ. యం.యన్.హరేంధిర ప్రసాద్‌ను కలిసి చర్చించారు. ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ వై.ఎస్. జగన్ మోహనరెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్న ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ ఉచిత వైద్య సేవలు నిరంతరాయంగా అందేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తాము వివిధ జిల్లాలలో పర్యటించే సందర్భంలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న వివిధ సమస్యల్ని పాత్రికేయులు, పాత్రికేయ సంఘాలు తమదృష్టికి తేవడం జరుగుతోందని ఛైర్మన్ పేర్కొన్నారు. ఆసుపత్రుల ఎంపిక నుంచి, అక్కడ తమకు సమన్వయ పరిచే అధికారి, తదితర సమస్యల్ని గ్రామీణ స్థాయి విలేకరి సైతం నేరుగా ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ముఖ్య కార్యనిర్వాహణాధికారికి వివరించి సత్వర పరిష్కారం పొందే విధంగా ప్రత్యేక విధానం అందుబాటులోనికి రావాలన్నారు. హెల్త్ కార్డు లు ద్వారా వైద్యసేవలు పొందేందుకు ప్రతి జర్నలిస్టు రూ. 1200/- చెల్లిస్తున్నారని, అంతే మొత్తం రాష్ట్ర ప్రభుత్వం తమ వంతు జమ చేస్తోందని సకాలంలో ఈ సౌకర్యాన్ని జర్నలిస్టులు వినియోగించుకోలేక పోతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం దెబ్బతినే ప్రమాదం వుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. వై.ఎస్.ఆర్. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ముఖ్య కార్య నిర్వాహణాధికారి (సి.యి.ఓ.) యం.యన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం అమలులో ఎదురవుతున్న సమస్యలన్నింటిని పరిష్కరిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని జిల్లాల పునర్విభజన వల్ల కొంత జాప్యం అయిన సంగతిని గుర్తించి తగుచర్యలు చేపట్టామని ఆయన ఛైర్మన్‌కు వివరించారు. జర్నలిస్టులకు ఈ పథకంలో ఎదురయ్యే సమస్య అప్పటికప్పుడు నేరుగా తెలియచేసి పరిష్కారం పొందే విధంగా 104 హెల్ప్‌లైన్ లో ''నెంబరు.4''ను యేర్పాటు చేయనున్నట్లు ఆయన ఛైర్మన్‌కు వివరించారు. ఇప్పటి వరకు "104 హెల్ప్‌లైన్'' లో 3 నెంబర్లు నొక్కి, పరిష్కారాలను పొందేందుకు అవకాశం ఉందన్నారు. జర్నలిస్టులకు ఈ పథకంలో ఎదురయ్యే సమస్యల్ని తమ కార్యాలయ దృష్టికి తెచ్చి గంటలోపు వ్యవధిలో పరిష్కారం పొందేందుకు 'నెంబరు. 4'ను "104 హెల్ప్‌లైన్''లో పొందుపరుస్తామన్నారు. ఈ విధానాన్ని నెలరోజుల లోపు అందుబాటులోకి తెస్తామని ఆయన తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని 2023-24 సంవత్సరానికి వర్తింప చేసే విధంగా సమాచార పౌర సంబంధాల కమీషనర్ తో కలిసి అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడనున్నాయన్నారు. అకాడమీ సెక్రటరి ఎం. బాల గంగాధర తిలక్ చైర్మన్‌తో పాటు ఉన్నారు.

# జర్నలిస్టుల రక్షణకు చట్టం

## ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఆమోదం

దేశంలోనే తొలిసారిగా జర్నలిస్టుల రక్షణకు ఒక చట్టం రూపుదాల్చింది. ఎంతోకాలంగా జర్నలిస్టులు దాడుల నుంచి చట్టబద్ధమైన రక్షణ కావాలని కోరుకుంటున్నారు. విధినిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు ఎలాంటి చట్టబద్ధ రక్షణ ఉంటుందో అటువంటి చట్టం కావాలని ఆశిస్తున్నారు. అందుకు ఇది తొలిమెట్టవుతుంది. జర్నలిస్టుల రక్షణ కోసం చత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఒక చట్టాన్ని తీసుకువచ్చింది. చత్తీస్‌గడ్ మీడియా పర్సన్స్ ప్రొటెక్షన్ బిల్లు-2023 చట్టం పేరిట ఈ చట్టానికి శాసనసభ అమోదం తెలియజేయడంతో ఇది చట్టరూపం దాల్చింది. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించింది.

ఛత్తీస్‌గడ్‌లో 2018 ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో జర్నలిస్టులకు రక్షణ కల్పించే చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చింది. ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక 2019లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆఫ్తాబ్ ఆలం నాయకత్వంలో ఈ అంశంపై అధ్యయనం చేసి చట్టం రూపం ఇచ్చేందుకు గల అవకాశాలను పరిశీలించేందుకు ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ మీడియాపై జరుగుతున్న దాడులు, వాటి నిరోధానికి గల అవకాశాలను అధ్యయనం చేసింది. ఈ కమిటీ సిఫార్సుల మేరకు మీడియా ప్రతినిధులపై హింసను నిరోధించడం, విధులు నిర్వర్తించడంలో రక్షణ కల్పించే దిశగా ఈ చట్టాన్ని తీసుకొచ్చింది.

**బిల్లులోని ప్రధానాంశాలు**

ఈ బిల్లు ప్రకారం ఆ వ్యక్తికి జర్నలిజంలో కనీసం పదేళ్ల అనుభవం ఉండాలి. ప్రస్తుత సంఘటనపై మీడియా సంస్థలో కనీసం ఆరు కథనాలను అయినా ప్రచురించాలి. లేదా కనీసం మూడు నెలల జీతాన్ని సదరు మీడియా సంస్థ నుండి పొంది ఉండాలి. మీడియా వ్యక్తి అంటే ఎడిటర్, రైటర్, న్యూస్ ఎడిటర్, డిప్యూటీ ఎడిటర్, ఫీచర్ రైటర్, కరస్పాండెంట్, కాపీ ఎడిటర్, కమ్యూనికేటర్, కార్టూనిస్ట్, న్యూస్ ఫొటోగ్రాఫర్, వీడియో జర్నలిస్ట్, ట్రాన్స్‌లేటర్, ట్రైన్ జర్నలిస్టులుగా ఈ బిల్లు పేర్కొంది. చట్టం అమల్లోకి వచ్చిన 90 రోజుల లోపు చత్తీస్‌గఢ్ మీడియా ఫ్రీడమ్ ప్రొటెక్షన్ అండ్ ప్రమోషన్ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఇది మీడియా పనిచేస్తున్న వ్యక్తుల వ్యక్తిగత నమోదుకు పనికి వస్తుంది. మీడియా వ్యక్తులపై వేధింపులు, బెదిరింపులు, హింస లేదా తప్పుడు ఆరోపణలు, అరెస్టు వంటి మీడియా వ్యక్తుల రక్షణకు సంబంధించిన ఫిర్యాదులను కమిటీ పరిష్కరిస్తుంది. ఈ కమిటీలో ప్రభుత్వంలో సెక్రటరీ స్థాయి రిటైర్డ్ అడ్మినిస్ట్రేటర్, పోలీసు అధికారి ఉంటారు. హోం డిపార్ట్మెంట్ నామినేట్ చేసిన ప్రాసిక్యూషన్ బ్రాంచ్ అధికారితో పాటు, ముగ్గురు మీడియా వ్యక్తులు, ఇందులో ఒక మహిళ కూడా ఉంటారు. ఒక ప్రైవేట్ వ్యక్తి హింసకు, వేధింపులకు లేదా మీడియా ప్రతినిధిని భయపెట్టడానికి కారణమైతే, కమిటీ కేసును పరిశీలించి ఇరు పక్షాల వాదనలను విన్న తర్వాత నేరస్తునికి 25 వేల రూపాయలు జరిమానా విధించవచ్చు. ఏదైనా కంపెనీ మీడియా ప్రతినిధిని బెదిరింపులు, హింస,అందుకు కారణమైతే ఈ కమిటీ కేసు పరిశీలించి,ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత 10 వేల రూపాయల జరిమానా విధిస్తుంది. అర్హులైన మీడియా ప్రతినిధుల నమోదులో ఎవరైనా అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నిస్తే కమిటీ దానిపై విచారించి సంబంధిత వ్యక్తికి జరిమానా విధించడమే కాకుండా కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఈ చట్టం ద్వారా లభిస్తుంది.



# న్యాయం జరిగేలా చూస్తా: కలెక్టర్

సత్తెనపల్లి విలేకరి సైదాను రాజకీయ నాయకురాలి భర్త బెదిరించిన కేసులో తగిన చర్యలు తీసుకుని న్యాయం జరిగేలా చూస్తానని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ జర్నలిస్టులకు హామీ ఇచ్చారు. సైదాను బెదిరించిన విషయమై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ వార్తలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే మరో మార్గంలో తెలియజేయాలే తప్ప ఇంటి వద్దకు మనుషుల్ని పంపి చంపేస్తామని బెదిరించడం సరికాదని కలెక్టర్ లోతేటి శివశంకర్ చెప్పారు. బాధిత విలేకరితోపాటు సత్తెనపల్లికి చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్, మీడియా ప్రతినిధులు నరసరావుపేటలో కలెక్టర్ ను కలిసి జరిగిన విషయాన్ని తెలియజేశారు. సైదాను బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరగా మంత్రి అంబటి రాంబాబుతో పాటు ఎస్పీతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తారని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. ఎస్పీ అందుబాటులో లేకపోవడంతో దిశ డీఎస్పీ రవిచంద్రను జర్నలిస్టులు కలిసి ఫిర్యాదు చేశారు.

---

# ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో డిప్లమా

శ్రీ సి రాఘవాచారి ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో త్వరలో డిప్లమా కోర్సులను ప్రవేశపెట్టనున్నట్టు ప్రెస్ అకాడమీ కార్యదర్శి బాలగంగాధర్ తిలక్ తెలియజేశారు. పాడేరు పర్యటనలో భాగంగా కలెక్టర్ సమావేశ మందిరంలో పాత్రికేయులతో ముచ్చరించిన సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. ప్రెస్ అకాడెమీ ఆధ్వర్యంలో పాత్రికేయులకు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నామని త్వరలో వారికి ఒక డిప్లమా కోర్సును ప్రవేశపెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన వివరించారు. గతంలో ఆసక్తి ఉన్న జర్నలిస్టులకు, విద్యార్థులకు మూడు నెలల సర్టిఫికెట్ కోర్సులను నిర్వహించామని, ప్రస్తుతం దాన్ని ఆరు నెలలకు పొడిగించి డిప్లమా కోర్సుగా నిర్వహించడానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంతో అంగీకారం కుదిరిందన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా అభ్యర్థులకు ఉపయుక్తంగా ఉండేవిధంగా సిలబస్ తయారు చేయడానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం, నాగార్జున విశ్వవిద్యాలయం, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం జర్నలిస్టు విభాగాల అధిపతులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఆ కమిటీ రూపొందించే సిలబస్ ఆధారంగా ఈ డిప్లమా కోర్సులను డిజైన్ చేసి వాటి నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ప్రెస్ అకాడమీ చేస్తుందని ఆయన తెలియజేశారు.

# మహిళా జర్నలిస్టులకు సత్కారం

మహిళా జర్నలిస్టులు పురుషులతో సమానంగా సమాజ పురోభివృద్ధికి పాటుపడుతున్నారని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో పలువురు మంత్రులు హామీ ఇచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా హైదరాబాద్ పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో మహిళా జర్నలిస్టులకు అవార్డుల ప్రధానం చేశారు. యేటికేడాది మహిళా జర్నలిస్టుల సంఖ్య పెరుగుతున్నదని, ఈ రంగంలోకి వస్తున్నవారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని వేళలా సహకరిస్తుందని వారు తెలియజేశారు. కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, శుభాకాంక్షలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ మీరు మంచి పని చేస్తే ఎవరు ఆపగలరు కానీ చిన్న తప్పు చేసిన బాధ్యత వహించాల్సి వస్తుంది. సమాజంలో మా పరిస్థితి కూడా అంతే.




ఎంత మంచి చేసిన ఎవరూ గుర్తించరు, కానీ తప్పులు అందరూ గుర్తిస్తారు. మహిళా కెమెరామెన్ జర్నలిస్టుల పని చాలా కష్టమైనది. మహిళల కోసం ఒక కార్యక్రమం అందుబాటులోకి తెస్తున్నారు. మీడియా రిలేషన్స్ రిలేటెడ్ స్టార్టర్ పనులు చేయాలనుకునే వారికి ఉపయోగపడుతుంది. ప్రభుత్వం ప్రజాప్రతినిధులు తప్పు చేసినప్పుడు చీల్చి చండాడండి. దాంతో పాటు ప్రభుత్వం చేసే మంచి కార్యక్రమాలను కూడా ప్రజలకు తెలియజేయండి. ప్రభుత్వంలో మంచి వైద్య సేవలు అందిస్తున్నాం. తాజాగా శిశు మరణాలు తగ్గాయి. నిమ్స్ లో అత్యధికంగా బ్రెయిన్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేన్లు చేశాం. మా తప్పులు ఎంత కవర్ చేస్తారో ఫస్ట్ న్యూస్ కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వండి. మాట్లాడటం సరికాదు, రాష్ట్రంలో ఉన్న మహిళా జర్నలిస్టులు అంతా కలిసి ఒక యూనియన్‌గా ఏర్పడి మీ సమస్యలను తెలియజేయండి. వాటికి తగిన పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ సత్కారం అందుకున్న మహిళా జర్నలిస్టులకు అభినందనలు తెలియజేశారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధానకార్యదర్శితో సహా మంత్రులు తమ సందేశాలను ఇచ్చి మహిళా జర్నలిస్టులను అభినందించారు.

# అమెరికాలో భారత జర్నలిస్టుపై దాడి

అమెరికా వాషింగ్టన్ లోని భారత రాయబార కార్యాలయం ముందు ఖలిస్తాన్ మద్దతుదారులు తనపై దాడి చేసినట్లు జర్నలిస్టు లలితా ఝా ట్విట్టర్ ద్వారా తెలిపారు. రాయబార కార్యాలయం ముందు ఖలిస్తాన్ మద్దతుదారులు నిరసనకు దిగిన విషయం తెలిసి వార్త కవర్ చేయడానికి వెళ్లారు. ఇంతలో నిరసనకారులు తనను దూషించడమే కాక తన ఎడమచేతిపై కర్రతో రెండుసార్లు కొట్టినట్లు తెలిపారు. వెంటనే తాను పోలీస్ హెల్ప్ లైన్‌కు ఫోన్ చేయగా అమెరికా సీక్రెట్ సర్వీస్ వారు తనకు



రక్షణ కల్పించారని, దీంతో తాను తన విధి నిర్వహించ గలిగానన్నారు. సీనియర్ జర్నలిస్టు లలిత్ పై ఖలిస్తాన్ మద్దతు దారులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు భారత రాయబార కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.



# విజయవాడలో డైరీ ఆవిష్కరణ


ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మీడియా డైరీ 2023 ను మార్చి 11న విజయవాడ వెస్ట్ జోన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కే హనుమంతరావు ఆవిష్కరించారు. వన్ టౌన్ లోని ఏసిపి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు షేక్ ఖాజావలి, విజయవాడ నగర అధ్యక్ష కార్యదర్శులు కలిమిశ్రీ, ఎంబీనాథన్ నగర నాయకులు శేఖర్, బాషా, పశ్చిమ సిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎన్ నరేంద్ర కుమార్, యూపీ ఫణికుమార్, ఏ శ్రీనివాస్, పోతిన వాసు, కే శ్రీనివాసరావు, రాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీ హనుమంతరావు మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టులకు విశిష్టమైన స్థానం ఉందన్నారు. నగరంలో జరుగుతున్న అనేక సంఘటనల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు జర్నలిస్టులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. సోషల్ మీడియాలో వార్తలను క్రాస్ చెక్ చేసుకుని ఇస్తే బాగుంటుందని సూచించారు. అలా కాకపోతే తప్పుడు వార్తలు కూడా వైరల్ గా మారి సమాజానికి తప్పుగా వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. ఏదైనా వివాదాలకు సంబంధించిన వార్తలు కానీ కథనాలు కానీ సంబంధిత అధికారి వివరణతో ఇస్తే సమగ్రంగా ఉంటుందని పేర్కొన్నారు.




ఫెడరేషన్ మీడియా డైరీ 2023ని కర్నూలులో పాణ్యం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించిన పోలీసు అధికారి

# నైతిక విలువల పతనం దిశగా మీడియా

భారతదేశ మీడియా దాదాపుగా కార్పొరేట్ సంస్థల కబంధహస్తాల్లో చిక్కుకుపోయిందని ప్రముఖ పాత్రికేయుడు, ది క్యారవాన్ సంపాదకుడు హరితోష్ సింగ్ బాల్ వ్యాఖ్యానించారు. ఒక ఔత్సాహిక పాత్రికేయుడికి ఉండేంత అవగాహన కూడా లేని వ్యక్తులు నేడు చాలా మీడియా సంస్థలకు యజమానులుగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శించారు. అంబానీ, ఆదాని వంటి పెద్ద పారిశ్రామికవేత్తలు సైతం వారి వ్యాపార ప్రయోజనాలను నిలబెట్టుకోవడం కోసం మీడియా రంగాన్ని ఓ ప్రధాన వాహకంగా చేసుకోవడం ప్రస్తుతం చూస్తున్నానంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని లామకాన్ 13వ వార్షికోత్సవ సందర్భంగా “రిచ్ మీడియా పూర్ జర్నలిజం'' అంశంపై ఆయన కీలక ఉపన్యాసం చేశారు. ఈ



సందర్భంగా మాట్లాడుతూ మీడియా రంగంలో నానాటికి నైతిక విలువలు సన్నగిల్లుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని అన్ని భాషల్లో వెలువడుతున్న మీడియా సంస్థల్లో చాలా చోట్ల సంపాదకత్వ స్థానాల్లోకి పాత్రికేయ విలువలకు అతీతమైన వ్యక్తులు మేనేజర్లుగా నియమితం కావడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోందన్నారు. వార్తలను సత్యశోధనతో విశ్లేషించే సంస్కృతి దాదాపుగా కనుమరుగవుతుందని అన్నారు. ప్రభుత్వ విధానాలను విమర్శిస్తే ఆ మీడియా సంస్థల మనుగడ కష్టంగా మారుతున్న దుస్థితిని ప్రస్తుతం చూస్తున్నామని విశ్లేషించారు. మరోవైపు మీడియా రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టులు, సిబ్బంది పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. స్వాతంత్రానికి ముందు, తర్వాత మీడియా ప్రయాణం ఒక తీరుగా ఉంటే, ఆర్థిక సంస్కరణలు అనంతరం మరొకలా, **2014** తర్వాత ఇంకోలా ఉందని విశ్లేషించారు. ఈ పరిస్థితులన్నింటినీ తట్టుకుని నిలబడి ముందుకు సాగే ప్రజా చైతన్యమే వర్తమాన పరిస్థితులకు గట్టి సమాధానం ఇవ్వగలదని హరితోష్ బాల్ సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# విలేకరులపై మాజీమంత్రి ఆగ్రహం

ఎమ్మెల్సీ ప్రచారంలో ఎన్నికల నిబంధనలు తుంగలో తొక్కి ప్రచారం చేస్తున్న వైసీపీ భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తాజాగా విలేకరులపై పడ్డారు. జీవిఎంసీ ఆరో వార్డు పరిధి పిఎం పాలెం సమీపంలో ఉన్న మాలతాంబ విద్యానికేతన్‌లో వైసీపీ అభ్యర్థికి మద్దతుగా ఎమ్మెల్సీ ప్రచారం నిర్వహించారు. ఆ పాఠశాల ఉపాధ్యాయులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమ అనంతరం ఇటీవల కాలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నారని ప్రభుత్వ పాఠశాల పనివేళల్లో ఉపాధ్యాయులను సమావేశపరిచి ఎమ్మెల్యే ముత్తంశెట్టి ప్రచారం చేస్తున్నారని పలు పత్రికల్లో వస్తున్న కథనాలపై ఆయన ఒక్కసారిగా అక్కడున్న విలేకరులపై మండిపడ్డారు. తాను ప్రచారం చేస్తే తప్పు టిడిపి నాయకుడు కోరాడ రాజబాబు చేస్తే తప్పు కాదా అని ప్రశ్నించారు. “నేను ఏమిటో తెలుసుకుని రాయి, నా గురించి రాయడానికి ఏం హక్కు ఉంది'' అంటూ విరుచుకుపడ్డారు. ''నువ్వేదో గొప్ప అనుకుంటున్నావా నువ్వు విలేకరివి అయితే నాకేమిటి, ఏం పీకుతావో పీక్కో నువ్వు నన్ను ఏమీ చేయలేవు, రేపటి నుంచి పార్టీ జెండా వేసుకు తిరుగు, పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే ఊరుకోను'' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాఠశాలకు ఎన్నికల ప్రచారానికి ఎమ్మెల్యే వస్తున్నారని యాజమాన్యం సీసీ కెమెరాలు నిలిపివేసింది. ఆ సమయంలో స్కూల్ సమీపంలో ఏదైనా సంఘటన జరిగితే సీసీ కెమెరాలు ప్రధాన సాక్ష్యంగా నిలుస్తాయన్న కనీస ఆలోచన లేకుండా అధికార పార్టీకి కొమ్ము కాయడాన్ని పలువురు విమర్శిస్తున్నారు.



# అగ్రసేని హాస్పిటల్ యాజమాన్యం పై చర్యకు డిమాండ్

న్యూస్ కవరేజ్ కు వెళ్లిన మీడియా ప్రతినిధుల పై అగ్రసేని హాస్పిటల్ యాజమాన్యం, స్టాఫ్ దాడులకు యత్నించడం దుర్మార్గమైన చర్య అని జర్నలిస్ట్ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆగ్రహం వ్యక్తం చేసింది.అగ్రసేని హాస్పిటల్ యాజమాన్యం రోగులకు వైద్యం అందించాల్సిందిపోయి వీధిరౌడీలను మరిపించే విదంగా దౌర్జన్యం చేస్తూ అసభ్య పదజాలంతో దూషిస్తూ రౌడీల మాదిరిగా దాడికి యత్నించడం దారుణమని జర్నలిస్ట్ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఉమ్మడి జిల్లా కన్వీనర్ టి.జి.ప్రసాద్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉన్న గాంధీ విగ్రహం దగ్గర జర్నలిస్ట్ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జేఏసీ ఆధ్వర్యంలో మార్చి 22న ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా కన్వీనర్ టి.జి.ప్రసాద్ కో కన్వీనర్లు రామకృష్ణ, సత్తార్, నాగరాజు గౌడ్,

## జర్నలిస్ట్ సంఘాల జేఏసీ

ఏపీడబ్ల్యూజెఎఫ్, ఎపిజెఎఫ్, జాప్, ఏపీబిజెఏ, ఏపీయూడబ్ల్యూజె జిల్లా నాయకులు పానుగంటి చంద్రయ్య, సాయికుమార్ నాయుడు, వినయ్, ఎస్ఎండి ఇస్మాయిల్, సత్యనారాయణ, పరమేష్, సురేష్, కిరణ్ కుమార్, రాజు, రాంమోహన్ హెచ్ఎంటీవి, మహాన్యూస్, 99టివి జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ హరికిషన్, ఖలీల్,ె డ.కృష్ణ జేఏసీ నాయకులు, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, సామిల్. వీజెవి శ్రీనివాసులు,ే డ.రాఘవేంద్ర గౌడ్, సుదర్శన్, రంగా, రాజశేఖర్, మల్లికార్జుననాయుడు, మురళి, శీను, చెన్నయ్య, రాజశేఖర్, సూరి, షఫీ, హసిఫ్, మాలిక్ తదితరులు మాట్లాడుతూ న్యూస్ కవరేజ్ కోసం వెళ్లిన జర్నలిస్ట్ లను అగ్రసేని హాస్పిటల్ యాజమాన్యం అండ చూసుకొని అక్కడ పని చేస్తున్న వ్యక్తులు మూకుమ్మడిగా అసభ్యకరంగా మాట్లాడుతూ దాడికి యత్నించడం అత్యంత దారుణం అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజలకు వారధిగా ఉన్న జర్నలిస్టుల పై దౌర్జనానికి పాల్పడిన అగ్రసేని హాస్పిటల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

అగ్రసేని హాస్పిటల్ యాజమాన్యానికి రోగులకు మధ్య ఘర్షణ జరుగుతోంది అని మార్చి 21 సాయంత్రం సమాచారం రావడంతో న్యూస్ కవరేజ్ కోసం హాస్పిటల్ దగ్గర వెళ్లిన మీడియా ప్రతినిధులపై దౌర్జనానికి పాల్పడడమే కాకుండా అసభ్యంగా ప్రవర్తించిన హాస్పిటల్ యాజమాన్యం, స్టాఫ్ పైనా పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖ హాస్పిటల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్ట్ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ ఏవో వెంకటేష్, త్రి టౌన్ సి.ఐ తబ్రేజ్‌కు వినతిపత్రం అందజేశారు.



# ప్రెస్ అకాడమీ పూర్వ అధ్యక్షులు శ్రీనాథ్ రెడ్డి కన్నుమూత

శ్రీ సి రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దీవిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి అనారోగ్యంతో మార్చి 23వ తేదీ హైదరాబాదులోని తన నివాసంలో మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైయస్సార్ కడప జిల్లా సింహాద్రిపురం మండలం కోవరం గుట్టపల్లెకు చెందిన శ్రీనాథ్ రెడ్డికి ఇద్దరు కుమార్తెలు భార్య ఉన్నారు. చెన్నై ట్రిపుల్ కెన్ లోని హిందూ హైస్కూల్లో పదవ తరగతి వరకు చదివారు . తిరుపతి శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో బీకాం అభ్యసించారు. ఎస్వీ యూనివర్సిటీలో ఆంగ్ల సాహిత్యంలో పీజీ చేశారు. 1978లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో జర్నలిస్టుగా చేరారు. అనంతరం బిబిసి, సాక్షి దినపత్రికలకు పనిచేశారు. కడప నుంచి దాదాపు 30 ఏళ్ల పాటు కడపలో సేవలందించారు. అనంతరం తిరుపతి, హైదరాబాదుల్లో పనిచేశారు. కడప జిల్లాలో పని చేసినప్పుడు రాయలసీమ వెనుకబాటుకు సంబంధించి రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై 'సెవెన్ రోడ్స్ జంక్షన్' పేరుతో ఆయన రాసిన కాలమ్స్ విశేష ప్రాచుర్యం పొందాయి. రాయలసీమ ఉద్యమంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి తదితరులతో కలిసి పనిచేశారు. 2019 నుంచి 2022 వరకు ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.


**జర్నలిస్టు సంఘాల నివాళి**

సీనియర్ జర్నలిస్టు ఆంధ్ర ప్రదేశ్ ప్రెస్ అకాడమీ పూర్వాధ్యక్షులు డి శ్రీనాథ్ రెడ్డి మృతి పట్ల నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్ ( ఎన్ఏజె), ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ( ఏపీడబ్ల్యూజేఎఫ్), ఆంధ్ర ప్రదేశ్ బ్రాడ్కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ ( ఏపీబీజేఏ) ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశాయి. సీనియర్ జర్నలిస్టుగా పనిచేసిన శ్రీనాథ్ రెడ్డి మరణం యువ జర్నలిస్టులకు ఎంతో నష్టం. ఎందరో యువ జర్నలిస్టులను రూపుదిద్దడంలో ప్రోత్సహించడంలో ఆయన కృషి ప్రశంసనీయం. రాయలసీమ అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా రాష్ట్రమంతటా జర్నలిస్టుల కోసం ఆన్‌లైన్ తరగతులు నిర్వహించారు. జర్నలిస్టులందరినీ ఒక్కతాటిపై తీసుకువచ్చేందుకు ఆయన ఎంతగానో ప్రయత్నం చేశారని ఎన్ఏజె సెక్రటరీ జనరల్ ఎన్.కొండయ్య, కోశాధికారి ఎ.అమరయ్య, ఏపీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు, ఏపీ బీజేఏ కన్వీనర్లు వి.శ్రీనివాసరావు, కె.మునిరాజులు అభిప్రాయపడ్డారు. ఆయన మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు.



ట్రంప్ అసత్య ప్రచారానికి ఫాక్స్ న్యూస్ వత్తాసు

# ట్రంప్ కొంపకు ముర్డోక్ తిప్పలు



ఫాక్స్ న్యూస్ పై పరువు నష్టం కేసులో మీడియా మొఘల్ వాంగ్మూలం

- అమరయ్య ఆకుల

ఓనాడు చెట్టపట్టాలేసుకు తిరిగిన రాజకీయ, మీడియా ప్రభువులు డోనాల్డ్ ట్రంప్, రూపర్ట్ ముర్డోక్ ఇప్పుడు బద్ధ శత్రువులుగా మారారు. దుమ్మెత్తిపోసుకుంటున్నారు. 'మితిమీరిన అహంభావంలో కురుకుపోయిన ఖైదీ ట్రంప్' అని ముర్డోక్ మీడియా అభివర్ణిస్తే 'పరువు నష్టం కేసుకే పారిపోతారా? సత్యం గొంతు నొక్కేస్తారా?' అని ట్రంప్ ముఠా ఎదురుదాడికి దిగింది. ఈ మొత్తం వివాదానికి ముర్డోక్ ఇచ్చిన వాంగ్మూలం కారణమైంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో బరిలోకి దిగాలనుకుంటున్న ట్రంప్ అవకాశాల్ని ఈ వాంగ్మూలం దెబ్బతీసేలా ఉంది.

**ఎవరీ మీడియా మొఘల్?**

రూపెర్ట్ ముర్డోక్ ఓ మీడియా మాగ్నెట్. ఫాక్స్ న్యూస్ ఛానల్, ఫాక్స్ న్యూస్ కార్పొరేషన్ సహా అనేక దేశాల్లోని మీడియా ఛానళ్లకు ఆయన యజమాని. మనదేశంలో ప్రసారమయ్యే స్టార్ ఛానళ్లన్నీ ఆయన సామ్రాజ్యంలోనివే. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, ఇండియా సహా 56 దేశాల్లో వందలాది ఛానళ్లు, డజన్ల కొద్ది పత్రికలు, పదుల సంఖ్యలో మ్యాగజైన్లు ముర్డోక్ ఆధీనంలోనివే. పుట్టి పెరిగింది ఆస్ట్రేలియాలో. బ్రిటన్ పౌరసత్వాన్ని కాదని అమెరికాలో స్థిరపడ్డారు. అసలు పేరు కీత్ రూపర్ట్ ముర్డోక్. 92 ఏళ్ల వయస్సు. 86 ఏళ్ల వయసులో నాలుగో పెళ్లి. నలుగురూ విడాకులు తీసుకున్నారు. ఆరుగురు పిల్లలు. ప్రతి సంతానానికీ ఏదోక మీడియా ఉంది. చైనా, రష్యా, ఉత్తర కొరియా లాంటి కొరుకుడు పడని దేశాల్లో తప్ప మిగతా చోట్ల ఆయన మీడియాకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సంబంధాలున్నాయి. అపార సంపద, పేరు ప్రతిష్టలతో పాటు కింగ్ మేకరన్న పేరుంది. ఆస్ట్రేలియా రాజకీయాల్లో ఆయనకు ఎదురుండదని పేరు. కన్సర్వేటివ్ పాలిటిక్స్‌కు వెన్నుదన్ను. ఇంగ్లాండ్‌లో ఫోన్ల హ్యాకింగ్ కేసులో బ్రిటన్ పార్లమెంటు ముందు విచారణకు హాజరై క్షమాపణలు కోరిన పెద్ద మనిషి మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో సుప్రీంకోర్టుకు వాంగ్మూలం ఇచ్చారు. వార్తల్లోని వ్యక్తిగా తెరపైకి వచ్చారు.

ఈ కేసు కథా కమామిషు ఏమిటంటే? 2020 నవంబర్‌లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. ట్రంప్, బైడెన్ పోటీ పడ్డారు. బైడెన్ గెలిచినా ట్రంప్ ఓటమిని అంగీకరించలేదు. ట్రంప్ ఓడిపోలేదని, ఎన్నికలకు కంప్యూటర్లు, ఓట్ల లెక్కింపు పరికరాలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందజేసిన డొమినీయన్ కంపెనీ ఓట్ల రిగ్గింగ్ కారణంగా ఆయన ఓడారని ఫాక్స్ న్యూస్ ఛానల్ ఊదరగొట్టింది. ఫాక్స్ న్యూస్ ఏమని ప్రసారం చేసిందంటే..

1. డొమినీయన్ కంపెనీ 2020 అధ్యక్ష ఎన్నికల్లో ఓట్లను తప్పుడు పద్ధతిన రిగ్గింగ్ చేసింది.

2.డొమినీయన్ కంపెనీ సాఫ్ట్‌వేర్, అల్గారిథమ్స్ ఓట్ల లెక్కింపును తారుమారు చేశాయి.

3. వెనిజులా ఎన్నికల్లో డొమినీయన్ కంపెనీకి అనుబంధంగా ఉన్న సంస్థ ఆదేశ నియంత హూగో ఛావెజ్‌కి అనుకూలంగా పని చేసి ఓట్లను రిగ్గింగ్ చేసి గెలిపించింది.

4. 2020 అధ్యక్ష ఎన్నికల్లో డొమినీయన్ కంపెనీ యంత్రాలు వాడేలా అధికారులకు ముడుపులు ముట్టజెప్పింది.

ఈ ఆరోపణల్ని డొమినియన్ కంపెనీ ఖండించింది. వీటివల్ల 2021 జనవరి నుంచి ఇప్పటికి 16 వందల కోట్ల డాలర్ల మేర కొనుగోళ్లు పడిపోయాయని, ఈ మొత్తాన్ని ఇప్పించడంతో పాటు తమ పరువు ప్రతిష్టల్ని కాపాడాలని వాషింగ్టన్ సుప్రీంకోర్టులో దావా వేసింది. ఇలా వేయడం ఇదే తొలిసారి కాదు. ఇంతకుముందు రెండు సార్లు వేసినా సరైన సాక్ష్యాధారాలు లేవని కోర్టు కొట్టేసింది. ఈసారి పక్కా ఆధారాలు, సమగ్ర సమాచారం, మెయిళ్లు, ఫాక్స్‌లు, వీడియోలు, రాతప్రతులతో 182 పేజీల దావా వేసింది. ముర్డోక్ అధిపతిగా ఉన్న ఫాక్స్ న్యూస్‌ను, ఫాక్స్ న్యూస్ కార్పొరేషన్‌ను, మరికొందరు హోస్టుల్ని ఇందులో ప్రతివాదుల్ని చేసింది.

## రిపోర్టర్ చెప్పినా వినకుండా...

రిగ్గింగ్, ఎలక్షన్ ఫ్రాడ్ జరిగిందనే దానికి ఎటువంటి సాక్ష్యాధారాలు లేవని ఫాక్స్ న్యూస్ చీఫ్ పొలిటికల్ రిపోర్టర్ బ్రెట్ బెయిర్ చెప్పినా ఫాక్స్ న్యూస్ ఛానల్ పదేపదే ఆరోపణలు చేసినట్టు డొమినీయన్ పేర్కొంది. ఉద్దేశపూర్వకంగా రాజకీయాల్లోకి లాగి తమ సంస్థ పేరు ప్రతిష్టలను దెబ్బతీయాలన్నదే లక్ష్యంగా ఫాక్స్ న్యూస్ ఈ పని చేసినట్టు ఈ ఏడాది ఫిబ్రవరి 16న ఈ దావా వేసింది. ఈ కేసును విచారణకు స్వీకరించాలా లేదా అనే దానిపై జరిగిన వాదోపవాదాల్లో ముర్డోక్ వాంగ్మూలం ఇచ్చారు. ఇప్పుడీ వాంగ్మూల పత్రాలు బయటకు వచ్చాయి. ఈ కేసు జ్యూరీకి వెళ్లనుంది. వచ్చే ఏప్రిల్ మధ్యలో విచారణ జరగనుంది.

## ముర్డోక్ ఇప్పుడేమి చెప్పారంటే...

'మా మీడియా సంస్థలపై విచారణ జరగడం ఇదే ఆదీ కాదు అంతమూ కాదు. 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికలను డొనాల్డ్ ట్రంప్ నుంచి దొంగిలించారనే తప్పుడు ప్రచారాన్ని ఫాక్స్ న్యూస్ హోస్ట్‌లు, న్యూస్ ప్రజెంటర్లు ఆమోదించారు. నాకీ విషయం తెలుసు. అయినా నేను ఆపలేదు' అని వాంగ్మూలం ఇచ్చారు. ఈనెల6న బయటకు వచ్చిన కోర్టు పత్రాలలో ఈ విషయం ఉంది. కోర్టుకు ప్రమాణపూర్వకంగా తెలిపిన వాంగ్మూలం ఇది. ఇప్పుడు దీని పర్యావసానం ఎలా ఉంటుందనే దానిపై రిపబ్లికన్ పార్టీ మేధావులు, ట్రంప్ మేనేజర్లు తలలు పట్టుకున్నారు.

## తెలుసు గానీ ఆపలేదు ముర్డోక్

డొనాల్డ్ ట్రంప్, ఆయన అనుచరవర్గం ఇచ్చిన సమాచారాన్నీ, అబద్ధాలను ఫాక్స్ న్యూస్ లీడర్లు సమర్థిస్తున్నట్టు తనకు తెలుసని ముర్డోక్ అంగీకరించారు. అయినా వాటిని ఆపేందుకు చర్య తీసుకోలేదన్నారు. ఈ వ్యవహారంలో తమ బాధ్యతేమీ లేదని ఫాక్స్ న్యూస్ కార్పొరేషన్ చేస్తున్న వాదన కూడా విచారణకు నిలబడదంటున్నారు. ఎందుకంటే ఆ కార్పొరేషన్‌కూ ఛైర్మన్ ముర్డోకే. తన మీడియా సంస్థల వ్యవహారశైలిపై సమాధానం కోసం ముర్డోక్‌ను ముందు పిలిచారు. 'మనం ముందు దాన్ని (ట్రంప్ ప్రచారాన్ని) ఖండించాలి. అదే సమయంలో మనం బలంగా ఉండాలి. అలా ఉండడానికే ఇష్టపడతాను' అని ముర్డోక్ చెప్పినట్టు 'న్యూయార్క్ టైమ్స్' కథనం. ఈ పత్రిక కూడా ఆయనదే. ట్రంప్ వాదనల్ని ముర్డోక్ తోసిపుచ్చారు. ఓట్లను దొంగిలించారని రుజువు చేయడానికి ట్రంప్ పన్నిన పథకంలో ప్రతి ఒక్కరికీ హాని కలిగించే భయానక విషయాలే ఎక్కువన్నట్టుగా అమెరికన్ మీడియా కథనాలున్నాయి. సిడ్నీ పావెల్, రూడీ గియులియానీ వంటి ట్రంప్ లాయర్లను ఫాక్స్ న్యూస్‌లో చర్చలకు పిలవొద్దని నెట్‌వర్క్‌ని తాను ఆదేశించవచ్చునన్నారు. 'నేను చేయగలను. కానీ నేను చేయలేదు' అని ముర్డోక్ తన వాంగ్మూలంలో చెప్పాడు.

## నిజంగానే ల్యాండ్ మార్క్ కేసా?

డొమినియన్ పరువు నష్టం దావాను ఓ 'ల్యాండ్‌మార్క్ కేసు'గా అభివర్ణిస్తున్నారు. హార్వర్డ్ న్యాయశాస్త్ర ప్రొఫెసర్ ఇటీవల గార్డియన్ పత్రికతో మాట్లాడుతూ, 'ప్రతివాది (ఫాక్స్ న్యూస్) తన వీక్షకుల సంఖ్యను, దాని ఆదాయాన్ని పెంచుకోవడానికి నకిలీ సమాచారాన్ని సృష్టించినట్టు రాతపూర్వకంగా అంగీకరించిన, పెద్ద రుజువున్న పరువు నష్టం కేసును నేనెప్పుడూ చూడలేదు' అన్నారు.

డొమినీయన్ కంపెనీ లాయర్లైతే అమెరికాలో రాజకీయ ద్వేషాన్ని పెంపొందించడంలో ఫాక్స్ న్యూస్ అతి పెద్ద పాత్ర పోషించిందని విరుచుకుపడ్డారు. 'నేను ఎవర్నైనా సవాలు చేస్తాను, నేను చెప్పిన వ్యక్తిని ప్రెసిడెంట్‌గా నామినేట్ చేయమనే దానికంటే అమెరికన్ ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కడానికే ఫాక్స్ న్యూస్ ఎక్కువ పని చేసిందని' ఆ లాయర్ వ్యాఖ్యానించారు.

**ఫాక్స్ న్యూస్ వాదన ఇదీ!**

డొమినియన్ వ్యాజ్యంలో 'చట్టపరమైన అంశాలకన్నా ఇతరత్రా విషయాలే ఎక్కువగా ఉన్నాయని ఫాక్స్ న్యూస్ ప్రతినిధి వాదన. 'జర్నలిస్టులను ప్రాథమిక రిపోర్టింగ్ నుంచి దూరం చేయడమే లక్ష్యంగా ఈ పరువు నష్టం కేసుంది. చట్టం ముందు ఇది నిలబడదు. న్యాయ మద్దతు లేని వైఖరిని ఆ కంపెనీ తీసుకుంది. యునైటెడ్ స్టేట్స్ సిట్టింగ్ ప్రెసిడెంట్ చేసిన ఆరోపణలను కవర్ చేయడానికి, వాటిపై వ్యాఖ్యానించడానికి వాళ్ల ముందస్తు అనుమతి తీసుకోవాలన్నట్టుగా వారి వాదన ఉంది. ఇది అమెరికా రాజ్యాంగ మొదటి సవరణ(పత్రికా స్వేచ్ఛ)ను ఘోరంగా ఉల్లంఘించడమే'నని వాదించారు.

**ఇప్పుడు స్వరమెందుకు మారిందీ?**

ఫాక్స్ న్యూస్ గతంలో చేసిన వాదనకు ఇప్పటికీ స్వరంలో తేడా వచ్చింది. డొమినియన్ కంపెనీ 2021 మార్చిలో, నవంబర్‌లో వేసిన రెండు దావాలలోనూ ఫాక్స్ న్యూస్, ఫాక్స్ న్యూస్ కార్పొరేషన్లు తమ కథనాలు రైటేనని వాదించాయి. ఫాక్స్ న్యూస్ కార్పొరేషన్ పని తీరు వేరుగా ఉంటుందని పేర్కొన్నాయి. ముర్డోక్ ప్రస్తుత వాంగ్మూలంతో ఫాక్స్ న్యూస్ కార్పొరేషన్ స్వరం మారింది. ఎన్నికల్ని ధృవీకరించకుండా ఆపడానికి అల్లర్లు, దేశ రాజధాని భవనంపై దాడికి ఒక రోజు ముందు అంటే 2020 జనవరి 5న ఈ సమస్యపై నెట్‌వర్క్ కవరేజీ గురించి ఫాక్స్ న్యూస్ మీడియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ సుజాన్ స్కాట్%--%మర్డోక్‌తో చర్చించినట్టు కోర్టుకు తెలిపారు. 'ట్రంప్ ఓటమిని ఒప్పుకోవాలి. బిడెన్ గెలిచినట్లు అంగీకరించాలి. పదే పదే చర్చలు పెట్టడం, వీక్షకులను విసిగించడం మంచిది కాదు' అని స్కాట్ చెప్పినట్టుగా బయటకు వచ్చింది. ఏమైనా, డొమినియన్, ఫాక్స్ న్యూస్ దావా ఏప్రిల్‌లో జ్యూరీ విచారణకు వెళ్లనుంది. మరో వోటింగ్ టెక్ కంపెనీ%--% స్మార్ట్‌మాటిక్ కూడా ఫాక్స్‌పై దావా వేసింది.

**ముర్డోక్ వాంగ్మూలంపై ట్రంప్ ఏమన్నారంటే...**

మాజీ అధ్యక్షుడు ట్రంప్ రూపర్ట్ ముర్డోక్‌పై మండిపడ్డారు. 'ట్రూత్' అనే తన సోషల్ అకౌంట్‌లో సోమవారం ఉదయాన్నే ఓ పోస్ట్ పెట్టారు. ఎన్నికల మోసం గురించి ట్రంప్ చేస్తున్న వాదనలను మీడియా మొఘల్ ముర్డోక్ ఎలా తిరస్కరించగలరు? అవి తప్పుడవని ఎలా చెప్పగలరని ప్రశ్నించారు. '2000 మ్యూల్స్'లో డ్రాప్ బాక్సుల్లో మిలియన్ల కొద్దీ 'స్టఫ్డ్ బ్యాలెట్‌లు' ఉన్నాయని చూపినప్పుడు ఎన్నికల మోసం జరగలేదని రూపర్ట్ మర్డోక్ ఎలా చెప్తారని నిలదీశారు. ('2000 మ్యూల్స్' అనేది టీవీ వ్యాఖ్యాత దినేష్ డిసౌజా నిర్మించిన చిత్రం. బ్యాలెట్ బాక్సుల అపహరణ, నకిలీ ఓట్లపై ఈ సినిమా తీశారు). ఇదే సమయంలో ట్రంప్%--% ఎఫ్‌బీఐ, ఫేస్‌బుక్‌పైనా దాడి చేశారు. ఈ సంస్థలు చేసిన ఎన్నిక మోసం ముర్డోక్‌కి కనపడలేదా? అని దండెత్తారు.

**ముర్డోక్ ప్రజాస్వామ్యానికే ముప్పు ఆస్ట్రేలియా మాజీ పీఎం**

న్యూస్ ఆఫ్ ది వరల్డ్... బ్రిటన్‌లో ఒకానొక సమయంలో మర్డోక్ సామ్రాజ్యానికి ఎదురులేని ఫ్లాగ్‌షిప్ టాబ్లాయిడ్ పేపర్. 2011లో బ్రిటన్ ప్రజల ఫోన్‌లను హ్యాకింగ్ చేసినందుకు అది మూతపడింది. హ్యాకింగ్ కేసులో ముర్డోక్%--% బ్రిటిష్ పార్లమెంటరీ కమిటీ విచారణకు నిలబడ్డారు. అత్యంత వినయంతో 'నా జీవితంలో ఇది అత్యంత విచారకరమైన రోజని' చెప్పి బయటపడ్డారు. ఆ తర్వాత సొంత గడ్డ ఆస్ట్రేలియాలో కూడా ఆయన, ఆయన కుమారుడు లాచ్‌లాన్ ముర్డోక్ పరువునష్టం దావాను ఎదుర్కొన్నారు. అనేక విమర్శల్నీ చవిచూశారు. ఆస్ట్రేలియా మాజీ ప్రధాని మాజీ కెవిన్ రూడ్ లెక్కప్రకారం ముర్డోక్ ప్రజాస్వామ్యానికి ముప్పు. మరో మాజీ ప్రధాని మాల్కం టర్న్‌బుల్ ప్రకారం రాజకీయాల్లో ప్రత్యక్ష జోక్యం ముర్డోక్‌కు అలవాటు. ఇదిలా ఉంటే, అమెరికా కేసు ముందు తేలితే ముర్డోక్ కుమారుడు లాచ్‌లాన్ ఆస్ట్రేలియాలో ఎదుర్కొంటున్న మరో పరువు నష్టం దావాను ప్రభావితం చేయవచ్చునని భావిస్తున్నారు.



# దెందులూరు ఎమ్మెల్యేకు ఫెడరేషన్ వినతి

ఏలూరుజిల్లా దెందులూరు నియోజక వర్గ స్థాయిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక శాసనసభ్యులు కొఠారు అబ్బయ్య చౌదరిని ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రతినిధులు మార్చి 9న కలిసి విజ్ఞప్తి చేశారు. నూతనంగా ఎన్నికైన ఫెడరేషన్ నాయకులు జర్నలిస్టుల సమస్యలను వివరించారు. నియోజకవర్గంలో మండలాల్లో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించేందుకు ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉన్నదని, వాటి పరిష్కారానికి తప్పనిసరిగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన ఫెడరేషన్ ప్రతినిధివర్గంలో ఫెడరేషన్ దెందులూరు నియోజకవర్గ అధ్యక్షులు ఎస్ రుషిరావు, కార్యదర్శి టి.వెంకట్రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి దర్శి సత్యనారాయణ, జాయింట్ కార్యదర్శి కె సోమేశ్వరరావు, చింతపల్లి శ్రీనివాసరావు, రాచప్రోలు వినోద్ పాల్గొన్నారు.

## మహిళా జర్నలిస్టుకు అవార్డు



అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం వివిధ రంగాలలో కీలకపాత్ర పోషిస్తున్న మహిళలకు అవార్డులను అందజేసింది. అందులో భాగంగా జర్నలిజం విభాగం నుంచి ఆంధ్ర ప్రభ ఢిల్లీ బ్యూరో చీఫ్ స్వరూపకు ఈ అవార్డు దక్కింది. మహిళా దినోత్సవ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఈ అవార్డును బహుకరించారు. వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారితో పాటుగా స్వరూప ఈ అవార్డును పొందింది.

# మీడియా డైరీ ఆవిష్కరించిన కర్నూలు ఎస్పీ

ఏపీడబ్ల్యూజేఎఫ్ మీడియా డైరీ 2023ను శోభకృత్ నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని కర్నూలు జిల్లా ఎస్పి సిద్దార్థ్ కౌశిల్, గీతాంజలి కిమ్స్ నర్సింగ్ కళాశాలల అధినేత పెరుగు విజయవర్ధన్ రెడ్డిలు ఆవిష్కరించారు. కర్నూలు నగరంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, జిల్లా అధ్యక్షులు కె.బి శ్రీనివాసులు, ఫోటోగ్రాఫర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు డి.హుస్సేన్, జిల్లా అధ్యక్షులు వి.శ్రీనివాసులు, ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి చిన్న రామాంజనేయులు, ఉపాధ్యక్షులు బసప్ప, నగర అధ్యక్షులు శివ కుమార్, కార్యదర్శి నాగేంద్ర, నాయకులు శ్రీరాములు, చంద్ర మోహన్, విద్యాసాగర్, మధు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.




# జర్నలిస్టుల సంక్షేమమే ఫెడరేషన్ ధ్యేయం

జర్నలిస్టుల హక్కుల సాధనతోపాటు, జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ పోరాడుతుందని ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు నవీన్ రాజ్ అన్నారు. మార్చి 14న తుని ఆర్ అండ్ బి అతిథి గృహంలో తుని నియోజకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నవీన్ రాజ్ హాజరై మాట్లాడుతూ జర్నలిస్టులు అనేక ఒత్తిడిలను, ఒడిదుడుకులను ఎదుర్కొంటూ సాహసోపేతంగా వృత్తిని కొనసాగిస్తున్నారన్నారు. జర్నలిస్టులకు ఇవ్వాల్సిన రాయితీలు హక్కులు కల్పించేందుకు ప్రభుత్వాలు చిత్తశుద్ధిని చూపాలన్నారు. జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని దీనికోసం ఫెడరేషన్ రాష్ట్ర నాయకత్వం కార్యాచరణతో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు ధర్మరాజు, లోవరాజు, కాకినాడ సిటీ అధ్యక్ష కార్యదర్శులు వాసంశెట్టి శ్రీనివాస్, త్రినాధ్, జిల్లా నాయకులు వంశీ, గోపీనాథ్, సతీష్ లు మాట్లాడుతూ ఫెడరేషన్ కార్యకలాపాలను వివరించారు.

## నూతన కమిటీ ఎన్నిక

ఎపిడబ్ల్యూజెఎఫ్ తుని నియోజకవర్గం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. తుని నియోజకవర్గ సర్వసభ్య సమావేశం జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు వాసా ధర్మరాజు అధ్యక్షతన జరిగింది. అనంతరం నూతన కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్ రాజ్ ఆధ్వర్యంలో కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. తుని నియోజకవర్గ ఏపీడబ్ల్యూజేఎఫ్ గౌరవ అధ్యక్షులుగా పి.వంశీ , అధ్యక్షుడు బి. ప్రవీణ్ చక్రవర్తి (తుని), కార్యదర్శిగా జి.సత్య వెంకట్ వర ప్రసాద్, (ప్రజాశక్తి కోటనందూరు), ఉపాధ్యక్షులు గా అచ్చారావు ,ఎ.శివరామకృష్ణ, సహాయ కార్యదర్శులుగా పడాల ప్రసాద్, కోశాధికారిగా కె.లోవరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సి.హెచ్.రామకృష్ణ, సభ్యులుగా మణికంత,అప్పలకొండ, స్వామి, కె.జయమణి, పడాల ఈశ్వరరావు, డి.నాయుడు, ఆర్.బుచ్చిరాజు, కె.ప్రకాష్ ఎన్నికయ్యారు.





## వ్యాలీ రోజ్‌కు ఎక్సలెన్సీ అవార్డు

మణిపూర్‌కు చెందిన సీనియర్ మహిళా జర్నలిస్టు, స్థానికంగా వెలువడే దినపత్రిక సంపాదకురాలు వ్యాలీ రోజ్ హాంగ్యో జర్నలిజంలో ప్రతిష్టాత్మకమైన ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపికైంది. మణిపూర్ రాష్ట్రంలో జర్నలిజంలో ఇచ్చే అవార్డును ఈమె సొంతం చేసుకున్నది. మణిపూర్ నుంచి వెలువడే ది అజా డైలీ దినపత్రికకు ఆమె సంపాదకురాలు, యజమాని కూడా. ఈ రాష్ట్రం నుంచి గిరిజన భాషల్లో వెలువడే ద్విభాషా దినపత్రిక ఇదొక్కటే. ఈశాన్యప్రాంత రాష్ట్రంలోని కొండకోనల్లో నివసించే గిరిజనుల సమస్యలను వెలికి తీసుకురావడం, వారి జీవితాల్లో వెలుగులు నింపే ప్రయత్నం సాగించే ఈ పత్రిక సంపాదకురాలు ఈ అవార్డుకు ఎంపిక కావడం పట్ల జర్నలిస్టు రంగంలోని అనేకమంది అభినందనలు తెలియజేశారు.

# కాషాయీకరణ కోసమే హిందూస్తాన్ సమాచార్‌కు ప్రాధాన్యత

### ఎన్.ఎ.జె విమర్శ

దూరదర్శన్, ఆకాశవాణిలను నిర్వహించే ప్రసార భారతిని ఆర్ఎస్ఎస్ తన సొంత సంస్థ హిందూస్తాన్ సమాచార్ ద్వారా స్వాధీనం చేసుకోవడం పట్ల నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్ఎజె), ఢిల్లీ జరులిస్టుల యూనియన్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి.

ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేశాయి. జాతీయ వార్తా సంస్థ పిటిఐ స్థానంలో జాతీయ ప్రసార సంస్థలైన ఆకాశవాణి, దూరదర్శన్‌లకు వార్తలను సరఫరా చేసే కాంట్రాక్టును హిందూస్తాన్ సమాచార్ దక్కించుకుంది. ఒకప్పటి ప్రధాన వార్తా సంస్థలైన పిటిఐ, యుఎన్ఐలను పక్కకునెట్టి, వాటి ప్రాధాన్యతలను తగ్గించడమే ఈ చర్య వెనుక గల ఉద్దేశమనిఆ ప్రకటన పేర్కొంది. పాలక పార్టీకి అనుగుణంగా దేశంలో వార్తలను కాషాయీకరణ చేయడం ద్వారా స్వతంత్ర, స్వేచ్ఛా, తటస్థ జర్నలిజాన్ని నిర్మూలించాలనుదే వారి లక్ష్యంగా వుందని జర్నలిస్టు యూనియన్లు విమర్శించాయి.

ఆర్ఎస్ఎస్ సిద్ధాంతానికి అనుగుణంగా సమాచారాన్ని రూపొందించేందుకు 1948లో హిందూస్తాన్ సమాచార్ ఆవిర్భవించింది. దేశ, రాష్ట్రాల రాజధానుల్లో దూరదర్శన్, ఆకాశవాణిలకు తమ సొంత విలేకర్లు ఉన్నారు. వారికి తోడు పిటిఐ, యుఎన్ఐ దేశ విదేశాల నుండి ఇచ్చే వార్తా సమాచారం తోడవుతుంది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఈ వార్తా సంస్థలకు ఆదేశాలు జారీ చేస్తూ షరతులు పెట్టేందుకు ప్రయత్నాలు జరిగాయి.

దాంతో పిటిఐకి ప్రసారభారతి సబ్‌స్క్రిప్షన్ ఆగిపోయింది. యుఎన్ఐని ఉద్దేశ్యపూర్వకంగానే నిర్లక్ష్యం చేశారు. దాంతో ఆ సంస్థలకు చెందిన జరులిస్టులు ఉద్యోగాలు కోల్పోయారు. ఈ చర్యలన్నీ లౌకిక, ప్రజాస్వామ్య రాజకీయాలకు మరో సవాలు విసురుతున్నాయని ఎన్ఎజె అధ్యక్షులు ఎస్‌కె పాండే, డియుజె ప్రధాన కార్యదర్శి సుజాత మదోక్, ఎన్ఎజె ప్రధాన కార్యదర్శి ఎన్.కొండయ్య విమర్శించారు. ఈ సంస్థకు వార్తా సమాచారాన్ని అందజేసే పాత్రను కట్టబెట్టడమంటే భారత సమాజాన్ని, రాజకీయాలను మరింత కాషాయీకరణ చేయడమేనని, మతోన్మాదాన్ని రెచ్చగొట్టడమేనని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్షంలోని పార్టీలకు కూడా ఇది తీవ్రమైన ముప్పేనని తెలిపారు.




# జర్నలిస్టులు సమాజ ప్రగతి సాధకులు

## ఘనంగా ఉగాది సంబరాలు

సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనదని, వారు నవ సమాజ ప్రగతి సాధకులని ఏయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్లు విశాఖపట్నం జిల్లా యూనిట్లు సంయుక్తంగా ఏయూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అసెంబ్లీహాలులో శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ప్రముఖ పండితులు కిరణ్ కృష్ణ పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆధ్య%శీ%తం అందరిని అలరించాయి. సంగీత కార్యక్రమాలతో పాటు క్లాసికల్ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో కేరింతలతో ఉత్సాహభరితంగా జర్నలిస్టుల కుటుంబాల ఆనందాల సవ్వడితో ఉగాది సంబరాలు అంబరాన్ని అంటాయి. అనంతరం జర్నలిస్టుల కుటుంబాలకు నూతన వస్త్రాలను బహూకరించారు.

ముఖ్య అతిథి ప్రొఫెసర్ పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏయూ సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. సుమారు మూడు వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఏయూ నిర్వహిస్తున్న వివిధ కోర్సులలో విద్యార్థుల శాతం పెంచడానికి అవసరమైన మౌలిక, బోధన సదుపాయాలు కల్పించడానికి చేస్తున్న కృషి వల్ల విద్యార్థుల శాతం గణనీయంగా పెరిగిందని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులకు అవసరమైన ఉద్యోగ, ఉపాధి రంగాలకు పనికి వచ్చే విధంగా నూతన కోర్సులను తీసుకొచ్చామని చెప్పారు. ప్రాధాన్యత కలిగిన కోర్సులను ఏయూ లో ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా ఏయూ పరిసరాలను పరిశుభ్రంగా తయారు చేయడంతో పాటు విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని చెప్పారు. మొత్తం మూడు పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మెరైన్, ఫార్మసీ, ఫుడ్ ఆధారిత శిక్షణ సంస్థలు విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఏయూ లో చదువుతున్న విద్యార్థులకు విద్యతో పాటు ఉద్యోగ కల్పన కోసం 79 కంపెనీలతో ఒప్పందాలు జరిగాయని తెలిపారు. మే నాటికి సుమారు 400 కంపెనీలతో ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందన్నారు. ఏయూ అభివృద్ధిలో మీడియా సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇక్కడ జరిగే అభివృద్ధి కార్యక్రమాలు బయట ప్రపంచానికి తెలియ జేయడానికి మీడియా రంగం కృషి చేయాలన్నారు. పంచాంగం పరిణామ క్రమమే సైన్స్ అన్నారు.



జాతీయు జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ సమాజ చైతన్యానికి జర్నలిస్టులు నాంది అన్నారు .ప్రభుత్వ సంక్షేమ పథకాలు విజయవంతంలో జర్నలిస్టుల కృషి ఎనలేనిది అన్నారు.ప్రజలకి ప్రభుత్వానికి మధ్య జర్నలిస్టులు వారిదిగా ఉంటూ సమస్యలను వెలుగులోకి తెస్తూ సమస్యలకు పరిష్కారం చూపుతూ చేస్తున్న సేవలు ఎనలేనివి అన్నారు. తెలుగువారికి ఉగాది ఒక ప్రత్యేక పండుగని, ఈ తెలుగు నూతన సంవత్సరంలో అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పోతుమహంతి నారాయణ్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఈ సంబరాలు వారిలో నూతన ఉత్సాహం కలిగిస్తాయన్నారు. ఈ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు,ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు డి. రవికుమార్, ఎ. సాంబశివరావు,జాతీయ కౌన్సిల్ సభ్యులు జి. శ్రీనివాసరావు,ఉపాధ్యక్షులు ఎన్. రామకృష్ణ, కె. మురళీకృష్ణ, రంగాధామం,బొప్పన రమేష్,కోశాధికారి బి. సీతారామమూర్తి,సంయుక్త కార్యదర్శులు పి. కామన్న, ఇజ్రాయిల్, రమణమ్మ,ఎం. వి. రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులను సన్మానించారు.



# వాస్తవాల వెల్లడికే మీడియా ప్రాధాన్యత

## అకాడెమీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

నిబద్ధతతో పనిచేసే విలేకరుల అవసరం నేడు ఎంతైనా ఉంది, వాస్తవాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లటంతో విలేకరుల పాత్ర ఎనలేనిదని జలవనరుల శాఖా మాత్యులు అంబటి రాంబాబు అన్నారు. జర్నలిజం మౌలిక సూత్రాలు- ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో మీడియా పాత్ర అంశంపై అవగాహన సదస్సు మార్చి 5న ఆర్టీసీ మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీ కొమ్మినేని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో నేడు జరుగుతున్న అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి చేరవేయటానికి పత్రికలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. నేడు కమ్యూనికేషన్ రంగం వేగంగా విస్తరిస్తున్నదని వాటి ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ సైనికుడి చేతిలో ఆయుధం, విలేకరి చేతిలో కలం ఒకేటనన్నారు. నిజాన్ని నిర్భయంగా వెల్లడించటానికి కలం కత్తి కంటే పదునుగా ఉపయోగించాలన్నారు. విలేకరులు సేవా దృక్పదంతో ఉండాలని, నిజాలను నిర్భయంగా వెల్లడించటానికి వెనకడుగు వేయాల్సిన అవసరం లేదన్నారు.

ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షులు, శాసనసభ్యులు మల్లాది విష్ణు మాట్లాడుతూ పత్రికలకు విశ్వసనీయతే ప్రాణమన్నారు. ఒక పత్రికలో వచ్చిన వార్తకు ఖండన మరో పత్రికలో రావటం అనే కొత్త సాంప్రదాయం ఇటీవల మొదలైందన్నారు. అది మంచి సంస్కృతి కాదన్నారు.

రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ అధ్యక్షులు మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ అవాస్తవాలను ప్రచారం చేస్తే నడిచే ప్లేగు వ్యాధి అని ఓ ఇంగ్లీషు కవి అన్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జర్నలిస్టులు సమాజానికి ప్రయోజకారిగా ఉండే రచనలు చేసిన పుస్తకాలను గ్రంధాలయ సంస్థ ద్వారా ప్రోత్సాహం అందిస్తామని ఒప్పంద పత్రాన్ని మంత్రి చేతుల మీదుగా విడుదల చేశారు.


కార్యక్రమంలో అధికార బాషా సంఘం అధ్యక్షులు శ్రీ విజయ్ బాబు, ఎన్నార్టీఎస్ ఛైర్మన్ మేడపాటి వెంకట్, జర్నలిస్ట్ పత్రిక సంపాదకులు కృష్ణంరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీమతి డాక్టర్ కెవి శాంత కుమారిలు రాష్ట్ర అభివృద్ధిలో మీడియా పాత్ర నిర్మాణాత్మకమైనదని అన్నారు. ఏపీ ప్రెస్ అకాడమీ సెక్రటరీ మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్, పత్రికా ప్రతినిధులు పాల్గొన్నారు.



## విలేకరిని బెదిరించిన వారిపై కేసు నమోదు

పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణానికి చెందిన విలేకరి షేక్ సైదా ఇచ్చినఫిర్యాదు మేరకు స్థానిక 12వ వార్డు కౌన్సిలర్ లోక కళ్యాణి భర్త మాధవ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎ.రఘుపతిరావు తెలిపారు. కోర్టు అనుమతితో మాధవ్‌తో పాటు ఆయన తమ్ముడు చంద్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. సత్తెనపల్లిలో పనిచేస్తున్న జర్నలిసస్టులందరూ తమ ఐక్యతను చాటారు.





# విశాఖలో డైరీ ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ 2023 రాష్ట్ర డైరీని మార్చి 7న రాష్ట్ర భారీ పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆవిష్కరించారు. సీతమ్మదారలో ఒక ప్రైవేటు భవన్ లో వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ విశాఖ యూనిట్ అధ్వర్యంలో మంత్రి ఈ డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వపరంగా సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ప్రపంచ పెట్టుబడులు సదస్సును విజయవంతం చేయడంలో తోడ్పడిన జర్నలిస్టులకు మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్ఎజె కార్యదర్శి గంట్ల శ్రీను బాబు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారంలో తమ యూనియన్ ముందు వరుసలో ఉందన్నారు. రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు నిరంతరం సమస్యల పరిష్కారానికి పోరాటం సాగిస్తుందన్నారు. మంత్రితో పాటు వైసిపి నేతలు కేకే రాజు, రవి రెడ్డి, సతీష్ వర్మ, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అర్బన్ యూనిట్ అధ్యక్షులు పి నారాయణ అధ్యక్షత వహించగా కార్యదర్శి అనురాధ. బ్రాడ్ కాస్ట్ విశాఖ జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వర రావు, రామకృష్ణ, డి. రవి కుమార్, జీ. శ్రీనివాసరావు, కోశాధికారి సీతారామమూర్తి సాంబశివరావులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. విజయవాడలోని ప్రెస్ అకాడమీ కార్యాలయంలో శ్రీనివాసరావును ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ప్రతినిధివర్గం కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న

# విజయవాడలో డైరీ ఆవిష్కరణ

సమస్యలను ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వెంకట్రావు వివరించారు. జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా వృత్తిపరమైన శిక్షణ, ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డుల సమస్యలను ప్రస్తావించారు. ఈ విషయాలన్నీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని శ్రీనివాసరావు తెలియజేశారు. వృత్తిపరమైన సమస్యలను ప్రెస్ అకాడెమీ తరఫున పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం 2023 మీడియా డైరీని కొమ్మినేని శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ కార్యదర్శి బాలగంగాధర్ తిలక్, ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు బి గోరంట్లప్ప, విజయవాడ నగర అధ్యక్ష కార్యదర్శులు కలిమిశ్రీ, ఎంబీనాథన్, కోశాధికారి శ్రీనివాసరావు, రాఘవ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలులో డైరీ ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రూపొందించిన మీడియా డైరీ 2023ను కర్నూలు జిల్లా కల్లూరులో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ కార్యదర్శి టి.మద్దులేటితో పాటు ఆర్గనైజింగ్ కార్యదర్శి చిన్న రామాంజనేయులు, నియోజకవర్గ నాయకులు కల్లూరు, పాణ్యం అధ్యక్ష కార్యదర్శులు సత్యనారాయణ, విజయ్‌కుమార్, వెంకటేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.






# ప్రెస్ అకాడెమీలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు

విజయవాడలోని ప్రెస్ అకాడమీ కార్యాలయంలో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాచార పౌర సంబంధాల కమీషనర్ టి. విజయకుమార్ రెడ్డితో కలిసి ప్రెస్ అకాడెమీ చైర్మన్ మహిళా జర్నలిస్టుల్ని సత్కరించారు. జర్నలిజం రంగంలో విపత్కర పరిస్థితుల్ని ఎదుర్కొంటూ మహిళా జర్నలిస్టుల కృషి కొనసాగిస్తున్నారని, వారిని ప్రోత్సహించే దిశగా ప్రెస్ అకాడమి అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. త్వరలోనే జర్నలిస్టులకోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించేందుకు అన్ని చర్యల్ని తీసుకుంటున్నామన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొనే మానసిక ఒత్తిడిని ఎదుర్కొనేందుకు ఇటీవలే ఒక సదస్సు నిర్వహించామన్నారు. ఇటువంటి సదస్సులలో ఎక్కువ మంది పాత్రికేయులు పాల్గొని ప్రయోజనం పొందాలని ఆయన సూచించారు. సమాచార పౌర సంబంధాల కమీషనర్ టి. విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ అక్రిడిటేషన్ల దరఖాస్తుల్లోని సమాచారం ఆధారంగా రాష్ట్ర స్థాయిలో మహిళా జర్నలిస్టుల ఫోరమ్ ఏర్పాటు చేస్తామన్నారు. మహిళా జర్నలిస్టుల సమస్యలు, వాటి పరిష్కారాలకు ఈ వేదిక చక్కని పరిష్కారమౌతుందన్నారు. ఇప్పటికే అక్రిడిటేషన్ కమిటీల్లో 50 శాతం మహిళా జర్నలిస్టులుండే విధంగా చర్యలు చేపట్టామన్నారు. మహిళా జర్నలిస్టుల సమస్యలపై మెరుగైన సలహాలు, సూచనలు ఇస్తే, ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్, హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలను మరింత మెరుగ్గా అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు సేవలు అందేందుకు ఆరోగ్యశ్రీ పథకంలో తగు మార్పులు చేపట్టి, ఆన్ లైన్ విధానాన్ని మెరుగు పరిచామన్నారు. మహిళలను కుటుంబ కేంద్ర బిందువుగా భావించి రాష్ట్ర ప్రభుత్వం వలు కార్యక్రమాల్ని అమలుచేస్తోందన్నారు.

ప్రెస్ అకాడమీ సెక్రెటరీ ఎం. బాల గంగాధర్ తిలక్ మాట్లాడుతూ మహిళా జర్నలిస్టుల కృషి వెల కట్టలేనిదని కొనియాడారు. ఈ సందర్భంగా నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం శాఖ హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు జి. అనిత, సాధారణ పరిపాలన శాఖ (ఐ.పి.ఆర్) సెక్షన్ అధికారిణి హేమలతలను శాలువాతో సత్కరించి జ్ఞాపికను కమీషనర్ టి. విజయకుమార్ రెడ్డి అందచేశారు. ఈ సందర్భంగా మహిళా జర్నలిస్టులు హసీనా షేక్ (టి.వి9.), రెహెనా బేగం,(ఎన్. టి.వి.), కాంతి (స్వతంత్ర న్యూస్ ఛానల్), పోరంకి లక్ష్మి(దూరదర్శన్), ఎం. ఎల్. ఎన్. మాధురి (ఆల్ ఇండియా రేడియో న్యూస్ రీడర్), కే. అమూల్య (ఫ్రీ లాన్సర్), ఈడుపుగంటి రోమీల (విశాలాంధ్ర), శాహిస్తా ఖానుమ్ (విశాలాంధ్ర), సుమలత (మహతి పత్రిక) రమణ ముక్తేవి (చైర్మన్ పి.ఎస్.) లను కమీషనర్ టి. విజయకుమార్ రెడ్డి శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందచేశారు.




# జర్నలిస్టు సమస్యల పరిష్కారానికి హామీ

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అనకాపల్లి జిల్లా విభాగ ప్రథమ సమావేశం అనకాపల్లి ప్రెస్ క్లబ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మార్చి 7న అనకాపల్లి స్థానిక రోటరీ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు బీశెట్టి వెంకట సత్యవతి వైఎస్ఆర్ సిపి అనకాపల్లి పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు అనకాపల్లి మండలాధ్యక్షులు గొర్లి సూరిబాబు హాజరయ్యారు. సమావేశానికి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వెంకటేష్ అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి ఈశ్వర్ జర్నలిస్టుల సమస్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు మాట్లాడుతూ విలేకరుల న్యాయబద్ధమైన జర్నలిస్టుల అక్రిడిటేషన్లు, జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, జర్నలిస్ట్ పిల్లల ఫీజు రాయితీ, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రధానమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న అనకాపల్లి ఎంపీ బీశెట్టి వెంకట సత్యవతి మాట్లాడుతూ జర్నలిస్టుల కోర్కెలు పరిష్కారానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని త్వరలోనే న్యాయబద్ధమైన కోర్కెలకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. అనకాపల్లి ఎంపిపి గొర్లె సూరిబాబు మాట్లాడుతూ జర్నలిస్టుల కోర్కె మేరకు త్వరలోనే అనకాపల్లి విలేకరులందరికి ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తున్నారని, దానికి మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆమోదం తెలిపారని, త్వరలోనే అందరికీ ఇళ్ల స్థలాలు అందజేస్తామని అన్నారు. వైఎస్సార్ సిపి అనకాపల్లి పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి విలేకరులు వారధి వంటి వారిని, వారి కోర్కెలు తీర్చవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని త్వరలోనే వాటిని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిష్కరిస్తారని అన్నారు. ఎంపీ బీసెట్టి వెంకట సత్యవతి చేతుల మీదుగా ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రెస్ స్టిక్కర్లను ఆవిష్కరించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీ సత్యవతిని ఫెడరేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ విశాఖ సిటీ అధ్యక్షులు పి.నారాయణ్, రవికుమార్, జి.శ్రీనివాసరావు, కాంతారావులు పాల్గొన్నారు.





## సీనియర్ జర్నలిస్టు రాజేశ్వరరావు కన్నుమూత

సీనియర్ జర్నలిస్టు సిహెచ్ రాజేశ్వరరావు హైదరాబాద్‌లో మార్చి 7వతేదీ మరణించారు. ఆంధ్రపత్రికలో జర్నలిస్టుగా పనిచేసిన ఆయన అనంతరం న్యూఢిల్లీలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్, డక్కన్‌క్రానికల్ పత్రికలకు పనిచేశారు. నేదురుమల్లి జనార్ధనరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయనకు మీడియా సలహాదారుగా వ్యవహరించారు. ఆయన ఎపి ఎస్‌ఈబి సలహాదారుగా ఉన్నారు. మన తెలంగాణ దినపత్రిక అంబుడ్స్ మన్‌గా హెచ్.ఎం.టివి సలహాదారుగా పనిచేశారు. ఆయన మృతికి నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు్ల అసోసియేషన్లు సంతాపం తెలియజేశాయి.

## విడియో జర్నలిస్ట్ చిన్న హఠాన్మరణం



విశాఖపట్నం మెట్రో టీవీలో వీడియో జర్నలిస్ట్ గా పనిచేస్తున్న బోనుల చిన్న (35) మార్చి 7న హఠాన్మరణం చెందారు. పిన్నవయసులోనే చిన్న మరణించడం నగర పాత్రికేయుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. చిన్నా అసలు పేరు ఏంటో చాలా మందికి తెలియదు. చిన్నా చిన్నా అని పిలుపించుకుంటూ చిన్న వయసులోనే వెళ్ళిపోయాడని అతనితో అత్యంత సన్నిహితంగా మెలిగిన పాత్రికేయులు ఫోటో విడియో జర్నలిస్టులు కన్నీటి పర్యంతమయ్యారు. చిన్న మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు్ల ఫెడరేషన్ కార్యదర్శి జి.శీనుబాబు, విశాఖపట్నం జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పి.నారాయణ్, అనురాధ, ఎ.పి.బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఈరోతి ఈశ్వరరావులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.



## జర్నలిస్టు శ్రీనివాస్ మృతి

ఈనాడు రిపోర్టర్‌గా పనిచేసిన మాచర్ల శ్రీనివాస్ మార్చి 8న గుండెపోటుతో మరణించారు. గతంలో ఆయన అంబర్ పేట ఈనాడు విలేకరిగా పనిచేశాడు. ప్రస్తుతం సొంత వ్యాపారం చూసుకుంటున్నారు. శ్రీనివాస్ అకాల మరణం పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు్ల తెలంగాణ శాఖ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

## జర్నలిస్టు మాదిరాజు మృతి

నరసరావుపేట సమీపంలోని రొంపిచర్ల గ్రామానికి చెందిన జర్నలిస్టు మాదిరాజు రామమూర్తి కన్నుమూశారు. ఆయన తెలుగు దినపత్రిక, ఆంధ్రభూమి దినపత్రికలో కొద్దికాలం పని చేశారు. ప్రస్తుతం ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా సేవలందిస్తున్నారు. మూర్తి విలువలతో కూడిన జర్నలిస్ట్‌గానే కొనసాగారు. ఆయన మృతి పట్ల ఫెడరేషన్ ఉపాధ్యక్షులు బి ఎస్ ప్రసాద్ సంతాపం వ్యక్తం చేశారు.




విజయవాడలో మార్చి 5న ప్రెస్ అకాడెమీ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుతో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ మల్లాది విష్ణు, అధికార భాషాసంఘం అధ్యక్షులు పి.విజయబాబు



మహిళా దినోత్సవ సందర్భంగా విజయవాడ ప్రెస్ అకాడెమీలో మహిళా జర్నలిస్టులతో చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, సమాచార శాఖ కమిషనర్ టి.విజయకుమార్‌రెడ్డి



ఉగాది సందర్భంగా మీడియా డైరీ 2023ని కర్నూలులో ఆవిష్కరించిన జిల్లా ఎస్పి సిద్దార్థ్ కౌశిల్, గీతాంజలి కిమ్స్ నర్సింగ్ కళాశాలల అధినేత పెరుగు విజయవర్ధన్ రెడ్డి, ఏపీడబ్ల్యూజేఎఫ్ కర్నూలు జిల్లా నాయకులు

In spite of numerous difficulties we came across in four years we have been providing YSR RYTHU BHAROSA-PM KISAN Assistance to the farmers on time, with the sole aim of standing by the farmers..
Like nowhere else in the Country, we are providing compensation to farmers for crop loss due to natural calamities in which calamity occurred by the end of same season. By the grace of God, I am committed to do much more for farmers..
-Y.S. Jagan Mohan Reddy, Your Chief Minister

Third tranche of Assistance for the Fourth Year in a row..

# YSR RYTHU BHAROSA - PM KISAN

Rs.13,500 in 3 instalments every year as YSR RYTHU BHAROSA – PM KISAN Assistance.. Already disbursed financial assistance of Rs.11,500 to each farmer in two tranches during the current year..

Sri. Y.S. Jagan Mohan Reddy, Hon'ble Chief Minister to deposit another Rs.2,000 each into the accounts of 51.12 lakh farmers totalling to Rs.1,090.76 Crores with a click of button Today in Tenali, Guntur district..



Including Today's assistance, Jagananna Government has so far credited Rs. 54,000 to each farmer under the 'Rythu Bharosa – PM KISAN' alone..

In an unprecedented initiative, Jagananna Government is extending the assistance of Rs.13,500 under "YSR Rythu Bharosa" scheme to all eligible landless SC, ST, BC, Minority farmers including ROFR & Endowment land Cultivators along with the farmers cultivating their own lands..

Jagananna Government in the last three years and nine months of governance has disbursed Rs. 27,062.09 Crores to farmers under "YSR Rythu Bharosa - PM KISAN" alone, including the present financial assistance of Rs. 1,090.76 Crores..

## Earlier than promised - More than assured assistance to the farmers..

Promised in the manifesto - Rs. 12,500 x 4 years = Rs. 50,000
Jagananna Govt., is extending - Rs. 13,500 x 5 years = Rs. 67,500
Additional amount being given more than manifesto promise - Rs. 17,500

Rs. 13,500 Rythu Bharosa - PM KISAN assistance per year to every eligible farmer's family..

| First instalment | Second instalment | Third instalment |
|---|---|---|
| Rs.7,500 in May, at the time of Kharif sowing season | Rs.4,000 in October for harvesting of Kharif crop | Rs. 2,000 in January/ February at the time of crop harvest |

## Total financial assistance provided by Jagananna Government in last 3 years and 9 months

| Name of the scheme | No.of farmers (in lakhs) | Financial assistance (Rs.in crores) |
|---|---|---|
| YSR Rythu Bharosa-PM Kisan | 52.38 | 27,062.09 |
| YSR Free Crop Insurance | 44.28 | 6,684.84 |
| Input subsidy to farmers | 22.22 | 1,911.78 |
| Paddy procurement (Till Today) | | 55,401.58 |
| Procurement of other farm produce (Till Today) | | 7,156.00 |
| Free power subsidy to farm sector | | 27,800.00 |
| Power subsidy for Aqua farmers | | 2,647.00 |
| For enhancing the capacity of feeders to supply 9 hours free quality power during daytime... | | 1,700.00 |
| Bonus for Bengalgram farmers | | 300.00 |
| Micro Cultivation and Horticulture | 13.58 | 1,264.24 |
| Subsidy for Oil Palm farmers | 0.32 | 85.47 |
| YSR Yantra Seva Pathakam | | 690.87 |
| Subsidy for Seeds | 60.76 | 1,023.52 |
| YSR Zero Interest Crop Loans(Including past Govt dues paid by us) | 73.88 | 1,834.55 |
| Paddy procurement dues (Previous Govt. dues paid by us) | | 960.00 |
| Previous Govt. Electricity dues (which we've borne ourselves) | | 8,845.00 |
| Seed subsidy dues by previous Govt.(paid by us) | | 384.00 |
| **Total assistance** | | **1,45,750.94** |

So far Jagananna Government has provided assistance of Rs.1,45,751 Crores to farmer families..

# INPUT SUBSIDY TO FARMERS..



Disbursing compensation for the crop loss by the end of the same season itself during which the loss occurred.. Fulfilling the promise once again..

Sri. Y.S. Jagan Mohan Reddy, Hon'ble Chief Minister to deposit an amount of Rs.76.99 Crores "Input Subsidy", directly into the bank accounts of 91,237 agriculture, horticulture farmers, who lost their crops due to Mandous cyclone, heavy rains, floods, sand and soil erosion during December 2022, before the end of Rabi Season 2022.. with the click of a button TODAY..

Including the present financial assistance of Rs.76.99 Crores being disbursed today, Jagananna Government has so far distributed an Input Subsidy assistance of Rs.1,911.78 Crores to 22.22 lakh farmers, who suffered crop loss due to natural calamities..

In an unprecedented initiative, provision of immediate relief to the farmers by disbursing compensation for crop loss by the end of the same season itself during which the loss occurred due to natural calamities..

Input subsidy distributed so far by Jagananna Government to farmers, for crop loss during natural calamities...

| Crop loss period | Date of payment of Input Subsidy | No. of Farmers | Input Subsidy in Crores (Rs.) |
|---|---|---|---|
| 2019-20 (Heavy Rains) | 26th April, 2020 | 1.57 Lakhs | 123.70 |
| April to Sept, 2020(Heavy Rains) | 27th Oct, 2020 | 1.74 Lakhs | 146.24 |
| October, 2020 (Heavy Rains) | 17th Nov, 2020 | 1.97 Lakhs | 132.63 |
| Nov, 2020 (Nivar Cyclone) | 29th Dec, 2020 | 8.34 Lakhs | 645.99 |
| Sept, 2021 (Gulab Cyclone) | 16th Nov, 2021 | 0.35 Lakhs | 22.10 |
| Sept, 2021 (Heavy Rains) | 15th Feb, 2022 | 5.97 Lakhs | 542.10 |
| Titli cyclone, 2018 (previous Govt) (Additional compensation to affected horticulture farmers..) | 22nd June, 2022 | 0.91 Lakhs | 182.63 |
| July-Oct, 2022 (Heavy Rains) | 28th Nov, 2022 | 0.46 Lakhs | 39.40 |
| Dec, 2022 (Mandous Cyclone) | 28th Feb, 2023 | 0.91 Lakhs | 76.99 |
| Total Input Subsidy | | 22.22 Lakhs | 1,911.78 |

## Previous Government

- Unscientific assessment of crop loss.. Pathetic situation where farmers had to run around middlemen, field officers for years together.. Yet unsure of receiving the compensation..
- The meager Input Subsidy was either paid after two or three seasons or was never paid...
- "NO" Input Subsidy was given by the previous Government for crop loss due to heavy rains in November and December 2015 and also for crop loss worth Rs. 2,449.16 Crores in Rabi & Kharif 2018 due to drought..

## Our Government

- Based on e-crop data assessment of crop loss is done in a scientific manner.. Display of eligible beneficiaries at RBKs for social audit in a most transparent manner.. Farmers can verify the list and lodge a complaint in the Village itself, if their names are not enlisted.. Compensation will be paid, if found eligible after verification..
- Jagananna Government is disbursing input subsidy directly into the accounts of farmers for the crop loss by the end of the same season during which the loss occurred...
- Jagananna Government has distributed Rs.1,911.78 Crores as Input Subsidy to 22.22 lakh farmers in these three years and nine months of governance..

Sri Kakani Govardhana Reddy
Hon'ble Minister for Agriculture & Co-operative, Marketing and Food Processing

Note: Sri. Y. S Jagan Mohan Reddy, Hon'ble Chief Minister to deposit financial assistance with the click of a button under "YSR Rythu Bharosa, Input Subsidy" at 11:00 AM on 28th February, 2023 in Tenali, Guntur District. Do watch the programme live on all popular news channels..

Issued By: Commissioner, Information & Public Relations Department, Government of Andhra Pradesh